# సీనియర్ కమ్యూనిస్టు కా॥ సయ్యద్ అబ్దుల్లా వర్ధంతి సభ



సయ్యద్ అబ్దుల్లా స్థూపంవద్ద నివాళులు

**బందరు, 16-9-2016 :**

మచిలీపట్నం కోనేరు సెంటర్ బట్టలకొట్ల సందులో సిపిఐ(ఎం.ఎల్) ఆధ్వర్యంలో సీనియర్ కమ్యూనిస్టు సయ్యద్ అబ్దుల్లా వర్ధంతిసభ జరిగింది. ముందుగా సిపిఐ(ఎం.ఎల్) జిల్లా నాయకులు కా॥యద్దనపూడి సోని కా॥సయ్యద్ అబ్దుల్లా స్మారక స్థూపం వద్ద ఎర్రజెండాను ఆవిష్కరించారు. పార్టీ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, బంధుమిత్రులు కా॥సయ్యద్ అబ్దుల్లా చిత్రపటానికి పూలమాలలు, పూలతో శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కా॥ యద్దనపూడి సోని ప్రసంగిస్తూ కా॥ అబ్దుల్లా చేసిన కృషిని గుర్తు చేశారు. ప్రస్తుత రాజకీయాలపై మాట్లాడుతూ 'యుపిఏ కాలంలో ద్రవ్యోల్బణం 11 శాతం వుంది. క్రూడ్ ఆయిల్ ధర అంతర్జాతీయంగా 144 డాలర్లు వుంది. ఈ కాలంలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. ఆనాడు ప్రతిపక్షంగా వున్న ఎన్‌డిఏ కూటమి ధరల పెరుగుదలకు మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం వైఫల్యం కారణమని పేర్కొంటూ వెంటనే నిత్యావసరసరుకుల ధరలు తగ్గాలని డిమాండ్ చేశారు. నేడు బిజెపి నాయకత్వంలో ఎన్‌డిఏ కూటమి పాలనలో ద్రవ్యోల్బణం 6 శాతం వుంది. అంతర్జాతీయంగా క్రూడ్‌ఆయిల్ ధర 44 డాలర్లుగా వుంది. అయినప్పటికీ సరుకుల ధరలు తగ్గకపోగా ఆ నాటికంటే నేడు అనేక రెట్లు పెరిగాయ'ని కా॥సోని విమర్శించారు. ఉత్తరప్రదేశ్‌లో పహల్‌గావ్ వంటి ప్రాంతాల్లో వందలాది మతసంఘర్షణలు సృష్టించి ముస్లింలలో అభద్రతను పెంచి హిందూమతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్నారని; హిందూ మతస్తులను బలమైన ఓటుబ్యాంకుగా మల్చుకొనే ప్రయత్నాలలో భాగంగా జరుగుతున్నవే ఈ దాడులని అన్నారు. ముస్లిం మైనారిటీలు, దళితులు, పేదలు సమైక్యంగా దళారీ పాలకుల ప్రజావ్యతిరేక విధానాలు, చర్యలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని అన్నారు.

ఇంకా స్త్రీవిముక్తి సంఘటన జిల్లా ఉపాధ్యక్షురాలు కా॥పామర్తి అంజమ్మ, ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు కా॥జి.మల్లేష్ కా॥సయ్యద్ అబ్దుల్లా కుమారులు శ్రీ సయ్యద్ పీర్, సయ్యద్ పకీర్ ఇతర బంధుమిత్రులు పాల్గొన్నారు. సిపిఐ(ఎం.ఎల్) నాయకులు కా॥జె.జగన్ సభకు అధ్యక్షత వహించారు.

OOOOOO